క్లుప్తంగా

నేడు మండల సమావేశం

నగరి : మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ భార్గవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు, అధికారులు, కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

సచివాలయాల్లో నేడు స్పందన

పాలసముద్రం : మండలంలోని అన్ని సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదివారం ఎంపీడీఓ ఎస్ విద్యావతి ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను శాఖల వారీగా ఆన్‌లైన్‌లో పెట్టాలని తెలిపారు. అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ఆదిదంపతుల ఊరేగింపు



నగరి : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కృష్ణారామాపురం గ్రామంలో ఆదివారం శివపార్వతుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారిని పట్టు వస్త్రాలు, సుగంధభరిత పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ప్రత్యేక వాహనాలపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. ఇంటింటా కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి, మొక్కులు చెల్లించారు.

25న మార్కెట్ వేలం పాటలు

పుత్తూరు రూరల్: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతు వధశాలకు సంబంధించి బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించే ఈ వేలం పాటల్లో పాల్గొనే వారు దినసరి కూరగాయల మార్కెట్‌కు రూ.20 లక్షల సాల్వెన్సీ ఈసీతో పాటు రూ.5 లక్షల నగదు డిపాజిట్ చేయాలని తెలిపారు. అలాగే ప్రైవేటు బస్టాండ్‌కు రూ.10 లక్షల సాల్వెన్సీ రూ.3 లక్షల డిపాజిట్, జంతు వధశాలకు రూ.3 లక్షల సాల్వెన్సీతో పాటు రూ.2 లక్షల డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. వేలం నెగ్గిన వారు పురపాలక సంఘం విధించిన నిబంధనలకు లోబడి రుసుములు వసూలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కరుమారియమ్మకు ప్రత్యేక పూజలు

నింద్ర: మండల కేంద్రంలోని ఓం శక్తి ఆలయంలో కరుమారియమ్మ దేవతకు ఆదివారం ఉదయం ప్రత్యేకపూజలు, హోమం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

నేడు నిరసన ప్రదర్శన

పుత్తూరురూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారించాలని సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ధర్మరాజులస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు గ్రామస్తులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు గ్రామీణ పేదల సంఘం కార్యదర్శి జి.భాస్కర్ తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



విజయపురం : మండలంలోని చెంగమనాయుడు కండ్రిగలో శివరాత్రి సందర్భంగా ఆదివారం లక్ష బిల్వార్చన పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలి

పాలసముద్రం : ద్విచక్రవాహనచోదకులు రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని ఎస్ఐ బి సురేష్ తెలిపారు. ఆదివారం బలిజకండ్రిగ–సోళింగర్ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ద్విచక్రవానచోదకులు రికార్డులు చెంతనే ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పదని హెచ్చరించారు. రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

పాలసముద్రం : మండలంలోని డప్పు కళాకారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని డప్పుకళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి డి కన్నన్ తెలిపారు. ఆదివారం పాలసముద్రంలో మండలంలోని డప్పు కళాకారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కన్నన్ మాట్లాడుతూ డప్పుకళాకారులందరూ ఐకమత్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆనంద్‌రాజ్, కార్యదర్శి పుష్పరాజ్ పాల్గొన్నారు.

అభ్యాసన..శతసాధన

చక్కని బోధన.. ప్రణాళికబద్ధంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ.. విద్యార్థుల అభ్యసంపై దృష్టి.. పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఆ దిశగా విద్యార్థులు సైతం ముందుకు దూసుకుపోతున్నారు. పది విద్యార్థుల ఫలితాల సాధనపై ప్రత్యేక కథనం.

- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు



బలిజకండ్రిగ హైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాలసముద్రం : విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. పది పబ్లిక్ పరీక్షల్లో సాధించే మార్కులే ఏ విద్యార్థికైనా ఉన్నత విద్యకు తొలి మెట్టు. దీనిని దృష్టిలో ఉంచుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉతీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్టడీ అవర్స్ ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా చదివిస్తున్నాయి. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకూ టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. గతంలో 11 పేపర్లు ఉండే ప్రశ్నపత్రాలు ఈ ఏడాది నుంచి ఏడుకు కుదించారు. పరీక్ష కాల వ్యవధి 3.15 గంటలు కాగా, ఒక్కో పేపర్ వంద మార్కులకు ఉంటుంది. పబ్లిక్ పరీక్షలకు సన్నాహల్లో భాగంగా పదోతరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలను ఆలస్యంగా తెరిచినా విద్యా సంవత్సరం సక్రమంగా సాగింది. జీడీ నెల్లూరు నియోజకవర్గం ప్రభుత్వ, ప్రైవేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది 2,558 మంది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సయయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్కులు సాధించేలా ముందుగా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై సంబంధిత పాఠ్యాంశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతేడాది డిసెంబర్ నెలాఖరు నాటికి అన్ని సబ్జెక్టుల బోధనను పూర్తి చేశారు. జనవరి నుంచి రోజుకు ఒక సబ్జెక్టు చొప్పున రివిజన్ టెస్టులు పూర్తి చేశారు. ప్రతి సబ్జెక్టు నుంచి రోజుకు ఒక పాఠ్యాంశాన్ని రివిజన్ చేయించడం ద్వారా మొత్తం సిలబస్ పునశ్చరణ జరుగుతోంది.

మండలం పేరు	హైస్కూళ్ల సంఖ్య	పది విద్యార్థులు
గంగాధరనెల్లూరు	16	655
శ్రీరంగరాజపురం	8	395
కార్వేటినగరం	12	497
వెదురుకుప్పం	9	401
పెనుమూరు	7	385
పాలసముద్రం	6	225

స్పెషల్ క్లాసులతో మేలు



ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో మాకు ఎంతో మేలు జరుగుతోంది. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాను. ఇంగ్లీష్, గణితం, సైన్స్ సబ్జెక్టులను శ్రద్ధగా బోధిస్తున్నారు. పదే పదే మోడల్ పరీక్షలు పెడుతున్నారు. దీంతో మాకు పరీక్షలంటే భయం పోయింది. మేము కూడా పదిలో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి ఇష్టపడి చదువుతున్నాం.

– సీకే వాణిశ్రీ , విద్యార్థి, జెడ్పీహైస్కూలు, బలిజకండ్రిగ

రోజూ రివిజన్ టెస్టులు



ప్రత్యేక తరగతుల్లో ప్రతిరోజూ అన్ని పాఠ్యాంశాలకు సంబంధించి రివిజన్ టెస్టులు పెడుతున్నారు. మరుసటి రోజు రివిజన్ టెస్టులో ఉన్న తప్పులను మాతో సరి చేయిస్తున్నారు. ఉపాధ్యాయులు మాకున్న అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ఇవన్నీ మేము పబ్లిక్ పరీక్షలను సకాలంలో సమగ్రంగా రాయడానికి దోహదం చేస్తాయని భావిస్తున్నాను. అన్ని పాఠ్యాంశాఅలు బాగా చదువుతున్నాను.

– కే గిరిప్రసాద్, విద్యార్థి, జెడ్పీ హైస్కూలు, బలిజకండ్రిగ

అందరికీ ఉపయోగం



ప్రత్యేక తరగతులు మాకందరికీ ఎంతో ఉపయోగం. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడంతో మేము మంచి మార్కులు సాధించుకునే అవకాశం కలుగుతుందని నమ్ముతున్నాం. ఉపాధ్యాయులు మా వద్ద ఉండి మాకు కలిగిన సందేహాలకు సమాధానలు చెబుతున్నారు. దీంతో మేము పాఠ్యాంశాలను సులభంగా అవగాహన చేసుకుని, నేర్చుకునేందుకు అవకాశం దొరుకుతుంది.

– కే మహేస్ కుమార్, విద్యార్థి, జెడ్పీ హైస్కూలు, ఆముదాల

ప్రత్యేక తరగతులు పర్యవేక్షిస్తున్నాం



ప్రతి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్నాం. జిల్లా విద్యాశాఖ ఇచ్చిన 60 రోజుల కార్యాచరణను అమలు చేస్తున్నాం. పదో తరగతి విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా విభజించి, వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. వందశాతం ఉతీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలి.

– రాజేంద్రప్రసాద్, మండల విద్యాశాఖాధికారి, పాలసముద్రం

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



సమ్మెటివ్ పరీక్షలు పూర్తి కావడంతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపు తున్నాం. పరీక్షల ఒత్తిడి లో విద్యార్థులు పొరపాట్లు చేయకుండా సులభ పద్ధతిలో మంచి మార్కులు ఎలా సాధించాలన్న అంశంపై ప్రత్యేక తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. మాదిరి పరీక్షలు పెట్టి, విద్యార్థుల్లో పరీక్షలంటే ఉండే భయాన్ని తొలగించడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటి నుంచే ఇళ్లలో పెద్దలు టీవీలు చూడకుండా విద్యార్థులు చదువుకునే వాతావరణం కల్పించాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నాం.

– ఎస్ మనోహర్ నాయుడు, హెచ్ఎం, జెడ్పీ హైస్కూలు, బలిజకండ్రిగ

గణితం అంటే భయం పోగొడుతున్నాం



కొందరు విద్యార్థులకు గణితం అంటేనే ఆ పాఠ్యాంశం కష్టమని, దాన్ని చదవలేమని భయపడుతున్నారు. అలాంటి వారిలో గణితమంటే ఉన్న భయాన్ని తొలగించి, దృష్టి పెడితే లెక్కలు సులువైన పాఠ్యాంశం అనేలా విద్యార్థులను మోటివేట్ చేస్తున్నాం. మాదిరి ప్రశ్నలతో వారికి శిక్షణ ఇస్తున్నాం. సమయాన్ని కచ్చితత్వాన్ని సరిచూసుకుంటూ పరీక్షలు రాయాలని సూచిస్తున్నాం.

– ఆర్డీ రాకేష్, గణిత టీచర్, జెడ్పీ హైస్కూలు, ఆముదాల

ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేంద్ర

విజయపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో తిరుపతికి చెందిన సురేంద్ర కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సురేంద్ర సుమారు 70 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 22 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఆపరేషన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జయచంద్రారెడ్డి, కైలాసయాదవ్, రామచంద్రరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా వెంకటేష్



నగరి : నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా టీఆర్ కండ్రిగకు చెందిన మాజీ కౌన్సిలర్ వెంకటేష్ నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్ర కాపు సంక్షేమ సేన కార్యనిర్వాహక కార్యదర్శి గోపీరాయల్ నుంచి నియామక పత్రం అందుకున్నారు.

22న పీడీఎఫ్ అభ్యర్థుల నామినేషన్

పుత్తూరు రూరల్: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే ప్రోగ్రెస్సివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థులు ఈ నెల 22న నామినేషన్ వేయనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అనుబంధ సంఘాలైన యూటీఎఫ్, ఎస్టీయూ, బిల్డింగ్ వర్కర్స్, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీడీఎఫ్ అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, పోకిరెడ్డి బాబురెడ్డి చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు వేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొనాలని కోరారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



వెదురుకుప్పం: కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



శివపార్వతుల కల్యాణోత్సవం చేస్తున్న వేదపండితులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని ఆరుణగిరిపై ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. తొలుత స్వామివారి ఉత్సవమూర్తులను పెళ్లి మండపానికి వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో మండలం నుంచి అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని, స్వామి వార్ల ఆశీర్వచనం అందుకున్నారు.

వేడుకగా సదాశివేశ్వరస్వామి కల్యాణం

కార్వేటినగరం: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుద్దగుంట సమీపంలో ఉన్న సౌందర్యవల్లీ సమేత సదాశివేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌ను పాలు, పెరుగు,తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తుల విశేషాలంకరణ చేసి, కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. వేద మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి ఉత్సవమూర్తులను నంది వాహనంపై కొలువు దీర్చి ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూరహారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మోహన్‌రాజు, కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం, రాజేంద్రరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణోత్సవం



మాంగళ్యం భక్తులకు చూపుతున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యపూజలు చేశారు. అనంతరం మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. పట్టువస్త్రాలు, ఆభరణాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం12 గంటలకు శ్రీదేవి, భూదేవి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా స్వామివారి కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. ఉభయకర్తలైన పల్లిచెరువుకు చెందిన హేమచంద్రారెడ్డి దంపతుల్ని కంకణదారుల్ని చేశారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, హోమం చేసి, శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాల నడుమ మాంగళ్యధారణ చేశారు. భక్తులు స్వామి వారికి కానుకలు సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు కె.శ్రీధర్, మేనేజర్ వెంకటేశులురెడ్డి, సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్మశానకొల్ల



విశేషాలంకరణలో శివపార్వతులు

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురం గ్రామంలో శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం శివ, పార్వతులకు ప్రత్యేక పూజలు చేసి, శ్మశానకొల్ల ఉత్సవం అట్టహాసంగా జరిగింది. ఉదయం శివ, పార్వతమ్మను పుష్పపల్లకిలో కొలువుదీర్చి, దీపారాదన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేక పూజలు చేసి, పురవీధుల్లో డ్రమ్స్, కొడుతూ యువకులు నృత్యాలు చేస్తు ఊరేగించారు. ఇంటింటా మహిళలు కొబ్బరి కాయలు కొట్టి, కర్పుర హారతుచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో భక్తులు వివిధ వేషధారణల్లో ప్రజలను ఆకట్టుకున్నారు. గ్రామానికి సమీపంలోని శ్మశానం వద్దకు పరమేశ్వరిని వేంచేపు చేసి, శ్మశాన కొల్ల ఘనంగా నిర్వహించారు.

వైభవం.. మహాకుంభాభిషేకం



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, రజతోత్సవ సంప్రోక్షణ, మహాకుంభాభిషేకం వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుల బృందం ఉదయం గణపతిపూజ, కలశస్థాపన, హోమ పూజలు జరిపారు. అనంతరం విగ్రహ ప్రాణప్రతిష్ట చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ఉమామహేశ్వరుడికి డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మహాకుంభాభిషేకం వేడుకల్లో పాల్గొని, ఉమామహేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. పెనుమూరు వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు వేలుమొదలియార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలన్నారు. సర్పంచ్ ఉమ, వైస్ ఎంపీపీ హరిబాబు, ఆర్బీకే సలహా మండలి బోర్డు చైర్మన్ బలరామరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్ పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

పాలసముద్రం : పాడిపశువులకు వచ్చే వ్యాధులపై పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి బానుప్రసాద్ తెలిపారు. ఆదివారం ఏట్టుకూరిపల్లెలో శ్రీజ మనహిళ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏసీఓ ఈ మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిపశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ఆ వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని తెలిపారు. అనంతరం తక్కువ ధరకు క్యాల్షియం, మిరల్‌మిక్చర్ అందజేశారు. సూపర్‌వైజర్ మారీ, రీగన్. చంద్ర బాబు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత



పుత్తూరు రూరల్: మహాశివరాత్రి సందర్భంగా శనివారం సదాశివకోనలో తప్పిపోయిన బాలుడ్ని ఆదివారం రాత్రి పుత్తూరు పోలీసులు అతడి బంధువులకు అప్పగించారు. ఎస్ఐ గౌరీశంకర్ కథనం మేరకు.. కేవీబీపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నక్కల సోము, కుట్టిఅమ్మ దంపతుల కుమారుడు దివాకర్(12) పిన్నమ్మ మునియమ్మతో కలిసి శనివారం సదాశివ కోనకు వచ్చారు. ఆ రోజే దివాకర్ తప్పిపోవడంతో మునియమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం కోన నుంచి అడవిలో ఒంటరిగా వస్తున్న బాలుడ్ని పోలీసులు విచారించి, పుత్తూరుకు తీసుకొచ్చారు. ఎస్ఐ గౌరీశంకర్ బాలుడి పిన్నమ్మ మునియమ్మకు అతడిని అప్పగించారు.

అ'పూర్వ' కలయిక



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వడమాలపేట: స్థానిక బాలిక పాఠశాలలో 2011 –12 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. పాఠశాలలో చదివిన నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరిని ఒకరు కుశల ప్రశ్న లు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన గురువులకు శాలువులు కప్పి సన్మానించారు. హెచ్ఎం భువనేశ్వరి, టీచర్లు శారద, దుర్గాబాయి, మంజుల, శాంతి వనజ, మాధురి, భారతి, పూర్వ విద్యార్థులు సుస్మిత, దివ్యవాణి, సుమతి, ప్రగతి, గౌతమి పాల్గొన్నారు.

ఘనంగా మయానసేవ



అమ్మవారి ఊరేగింపు



శ్మశాన కొల్ల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగాధరనెల్లూరు: అగరమంగళం గ్రామంలోని గుర్రప్ప అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం మయానసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దీపక్‌కుమార్ తాళ్ల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉదయం హోమ పూజలు జరిపారు. అనంతరం భూతవాహనంపై అమ్మవారిని కొలువుదీర్చి, చెక్కభజనలు, కేరళ వాయిద్యాలు, గుర్రపు బొమ్మలాట, పంబ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు వివిధ వేషదారణలో అలరించారు. శ్మశాన కొల్ల అట్టహాసంగా నిర్వహించారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్ ప్రత్యేక పూజలు

ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి దంపతులు మయానసేవలో పాల్గొని అంకాళపరమేశ్వరికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

పొగమంచే తెరగా నిలిచిందిలే..



గంగాధరనెల్లూరును కమ్మివేసిన పొగమంచు

గంగాధరనెల్లూరు: మబ్బే మసకేసిందిలే..పొగ మంచే తెరగా నిలిచిందిలే.. అన్నాడో సినీ కవి. అలా ఆదివారం గంగాధరనెల్లూరు మండలాన్ని పొగమంచు కప్పేసింది. మంచుకు ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసు కుని ప్రయాణించాల్సి వచ్చింది. ఉదయం తొమ్మిది గంటలైనా మంచు వీడలేదు. పొగమంచు కురవడంతో ఎండలు ఎక్కువ అవుతుందని ప్రజలు అంటున్నారు.



వీరకనెల్లూరులో..

వైఎస్సార్‌సీపీ నేతకు మంత్రి సోదరుడి పరామర్శ



నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

నగరి : మండలంలోని ఐనంబాకానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మురుగయ్యను మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మురుగయ్య అల్లుడు మురళి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. సమాచారం అందుకున్న రామ్‌ప్రసాద్ రెడ్డి నాయుడు పేట మండలం నల్లబెల్లి గ్రామానికి వెళ్లి, మురళి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, వైస్ ఎంపీపీ ఢిల్లీ బాబు, ఆనందరెడ్డి, చంద్రారెడ్డి, సత్య ఉన్నారు.

నివాళి



తులసిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

వడమాలపేట: మంత్రి ఆర్కే రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి ఆదివారం మండలంలోని టీసీ అగ్రహారం గ్రామానికి చెందిన తులసిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఇరగారెడ్డి సోదరుడు తులసీరెడ్డి శనివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి ఆర్కే రోజా సోదరులు ఆదివారం టీసీ అగ్రహారం గ్రామానికి వెళ్లి, తులసిరెడ్డి మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇరగారెడ్డిని ఓదార్చారు. ఎల్ఎమ్ కండ్రిగ సర్పంచ్ ధర్మయ్య, నాయకులు పుల్లయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి యాదవ్‌కు పరామర్శ

పుత్తూరు రూరల్: చిన్నబ్బనాయుడు కండ్రిగకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవియాదవ్‌ను మంత్రి సోదరుడు కుమారస్వామి రెడ్డి ఆదివారం పరామర్శించారు. చిరంజీవి తండ్రి సుబ్రమణ్యంయాదవ్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం కర్మక్రియలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ హరి, నాయకులు జనార్దన్‌యాదవ్, అన్నాలోకనాథం, చీరాల, తదితరులు ఉన్నారు.